10 YEAR ANNIVERSARY 2014 - 2024
పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# ఐదేళ్లలో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దుతాం మంత్రి సుభాష్.







**రామచంద్రపురం/ అమలాపురం, పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 20:** స్థానిక నియోజకవర్గంలోని రామచంద్రపురం ,కే గంగవరం మండలాలలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమాల్లో పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ నిధులతో గ్రామాలలో మౌలిక వసతులైన సిసి రోడ్లు డ్రైన్లు తదితరాలను నిర్మించేందుకు గ్రామసభ ఆమోదం తీసుకోవడం జరిగిందన్నారు. గ్రామసభ తీర్మానం పొందిన పనులను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో భాగంగా భూమి పూజ చేసి సంక్రాంతి నాటికి పూర్తిచేసే విధంగా కార్యచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగా ఆదివారం రామచంద్రపురం మండలం వేలం పాలెం గ్రామంలో 23 లక్షల ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్లు, ద్రాక్షారామంలోని నున్న వారి వీధిలో 3 లక్షల 50 వేల రూపాయలతో సిసి రోడ్డు, కే గంగవరం మండలం బాలాంత్రం గ్రామం లో 31 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు భూమి పూజ నిర్వహించడం జరిగిందన్నారు.రామచంద్రపురం నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను త్వరలోనే నిర్మిస్తామన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవ కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గంలో సుమారు 6 కోట్ల 70 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని మంత్రి తెలిపారు. త్వరలోనే మరిన్ని నిధులు తీసుకొచ్చి రామచంద్రపురం నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఆయన పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దామని మంత్రి తెలిపారు. రామచంద్రపురం మండలం వేలం పాలెం గ్రామంలో 17 లక్షల రూపాయల సీఎండీఎఫ్, జడ్.పి.జి.ఎఫ్ నిధులతో నిర్మించిన గ్రామీణ నీటి సరఫరా ఉప కార్యనిర్వహక ఇంజనీర్ వారి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ కార్యక్రమాలలో రామచంద్రపురం కే గంగవరం ఎంపీడీవోలు పద్మజ్యోతి శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ యేసు రత్నం, వేలం పాలెం, ద్రాక్షారామం బాలాంత్రం సర్పంచులు టేకుమూడి సునీత, కొత్తపల్లి అరుణ, శివరాం, ప్రజా ప్రతినిధులు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయులకు వార్త సేకరణలపై దిశా నిర్దేశం





**-పెన్ పవర్ ఎడిటర్ గంట్యాడ ఆనంద్**

**పెన్ పవర్, అక్టోబర్ 20 :**రాజమహేంద్రవరం స్థానిక ఆర్.అండ్.బి అతిథి గృహంలో ఆదివారం జరిగిన ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పాత్రికేయుల సమావేశం ఉభయగోదావరి జిల్లాల ఇన్చార్జి ఏం.వి.వి.ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పెన్ పవర్ దినపత్రిక ఎడిటర్ గంట్యాడ ఆనంద్ విలేకరులకు తగు సూచనలు చేశారు. వృత్తుల్లో పాత్రికేయ వృత్తి అత్యంత ప్రధానమైనదని, వృత్తిపట్ల సమయ భావన, సమయస్ఫూర్తి ఉండాలని పేర్కొన్నారు. పాత్రికేయులు కచ్చితత్వంతో ముందుకు సాగాలన్నారు. జిల్లా ఇన్చార్జిలు మండల కేంద్రములో తప్పనిసరిగా విలేకరులు నియమించాలని, సిటి పరిధిలో డేట్ లైన్ ప్రాతిపదికన విలేకర్లను నియమించుకోవాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఇంచార్జీ సత్యనారాయణ మాట్లాడుతూ అక్షర దోషాలు దొర్లకుండా వార్తలు సరైన క్రమంలో, సమయపాలన పాటిస్తూ వార్తలు ఇవ్వాలన్నారు. పాత్రికేయులు తప్పనిసరిగా ప్రజా సమస్యలపై అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నించి పరిష్కార దిశలో వార్త సేకరణ జరగాలన్నారు. ఈ సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా ఇన్చార్జి సత్య సాయిరామ్, కాకినాడ జిల్లా ఇన్చార్జి దడాల ఏడుకొండలు, పశ్చిమ గోదావరి జిల్లా ఇన్చార్జి కోలాటి మోసే బాబు, అమలాపురం జిల్లా ఇన్చార్జి సి.హెచ్ రత్నం, పాడేరు జిల్లా ఇన్చార్జి వి.అర్.జి.వి.రత్నం, జి. ప్రసాద్, ఎ.చిరంజీవి, ఎస్.వెంకటేశ్వరరావు, ఎన్.రాంబాబు, డి .వేంకటేశ్వర రావు, టి.శ్రీనివాస్, టి. జె . సత్య, శ్రీకాంత్, జి. అనిల్ కుమార్, బొంతు రామారావు,ఎన్. శ్రీరామ్ , డి. నారాయణ, బి.వి.రామారావు, పి.రమణ తదితరులు పాల్గొన్నారు.





# పల్లె పండుగలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 20:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం లో భాగంగా ఆదివారం మండలంలోని మొల్లేరు పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. 15 లక్షల విలువైన మూడు సీసీ రోడ్లు, రెండు లక్షల 30 వేల విలువైన గోసాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామ తులసి, పంచాయతీరాజ్ విస్తరణాధికారి నరసింగరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ప్రకాష్, తెలుగుదేశం పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పాము అర్జున, కూటమి నాయకులు పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా జిల్లా ల్యాబ్ టెక్నీషియన్స్ నాలెడ్జ్ కాన్ఫరెన్స్



**-పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 20 :**ప్రజల ఆరోగ్యాన్ని డాక్టర్లు ఎంత స్థాయిలో కాపాడుతారో అదే స్థాయిలో ల్యాబ్ టెక్నీషియన్లు కాపాడుతున్నారని రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం లోని హోటల్ షెల్టన్ లో రాజమండ్రి ల్యాబ్స్ అండ్ ల్యాబ్ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన తూర్పుగోదావరి జిల్లా ల్యాబ్ టెక్నీషియన్స్ నాలెడ్జ్ కాన్ఫరెన్స్ కు మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. తూర్పుగోదావరి జిల్లా డయాగ్నోకాన్-2024 సమావేశం సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్స్ తమ సమస్యలను మంత్రి దుర్గేష్ కి విన్నవించారు.. ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలపై మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. ల్యాబ్ టెక్నీషియన్ల నుంచి విజ్ఞాపన పత్రాలను స్వీకరించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ల సంక్షేమ బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కడెక్కడ ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయో గుర్తించి వాటిని భర్తీ చేయాల్సిన పూర్తి బాధ్యత తమపై ఉందని పేర్కొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లకు ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో ఇప్పటివరకు జరిగిన ఇబ్బందులను అధిగమిస్తామన్నారు. గడిచిన ఐదేళ్లలో ఎలాంటి రిక్రూట్మెంట్ జరగకపోవడం శోచనీయమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాము మెగా డీఎస్సీ పేరిట ఉపాధ్యాయ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తున్నామన్నారు. అదే విధంగా ల్యాబ్ టెక్నీషియన్లు పోస్టుల భర్తీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ల్యాబ్ టెక్నీషియన్లకు సామాజిక భద్రత కల్పించడంతోపాటు సామాజిక బీమా ఏర్పాటు చేసే బాధ్యత తమపై ఉందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.. అంతేగాక ల్యాబ్ టెక్నీషియన్లను బీమాలో భాగస్వాములను చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.. ల్యాబ్ టెక్నీషియన్లు కోరినట్టుగా కనీస సౌకర్యమైన ఆఫీస్ లేదా స్థలం ఏర్పాటుకు ఆలోచిస్తామన్నారు.కీలకమైన సమయంలో కీలకమైన సమావేశం ఏర్పాటు చేసినందుకు సంబంధిత నిర్వాహకులకు మంత్రి అభినందనలు తెలిపారు..

**ఆధునిక వైద్యంలో ల్యాబ్ టెక్నీషియన్లది కీలక పాత్ర...**

ఆధునిక వైద్యం వచ్చిన తర్వాత రోగ నిర్ధారణ కోసం వైద్యులు ల్యాబ్ టెక్నీషియన్స్ మీద ఆధారపడే పరిస్థితి వచ్చిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. వైద్య రంగం మొత్తం ల్యాబ్ టెక్నీషియన్ల మీద ఆధారపడే సందర్భం నెలకొందన్నారు.. రోగికి సంబంధించి వైద్య పరీక్షలు మొదలు ఎమ్మారై స్కాన్, ఇతరత్రా సేవలకు ల్యాబ్ టెక్నీషియన్ అవసరం తప్పనిసరి అన్నారు. ఒక వ్యక్తి తాలూకూ రోగాన్ని నిర్ధారించాలన్నా, మందు ఇవ్వాలన్నా, ఏ చికిత్స విధానం అవలంబించాలన్నా రోగికి, డాక్టర్ కు మధ్య ఉండే ల్యాబ్ టెక్నీషియన్ పాత్ర కీలకమైంది అన్నారు.. ప్రస్తుత కాలంలో ల్యాబ్ టెక్నీషియన్ల ప్రాతినిధ్యం పెరిగిన నేపథ్యంలో సంబంధిత వృత్తిపై ఆధారపడి బతికే వారి సంఖ్య కూడా పెరిగిందని మంత్రి వివరించారు.. ఈ నేపథ్యంలో ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ లతోపాటు అధికారులు ఇతర నాయకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళలు అవగాహన పెంచుకోవాలి









● 5 కె రన్ లో ఎమ్మెల్యేలు బత్తుల, ఆది రెడ్డి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 20 :** రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళలు అవగాహన పెంచుకోవాలని రాజానగరం,రాజమహేంద్రవరం ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా జీఎస్ఎల్ ట్రస్ట్ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పుష్కరాల రేవు నుంచి జరిగిన 5కె రన్ అండ్ వాక్ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు ఇరువురు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ఒకటన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రొమ్ము క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాన్నారు. 2022లో ప్రపంచవ్యాప్తంగా 6 లక్షల 70వేల మంది ఈ కేన్సర్ కారణంగా మృత్యువాత పడ్డారని, 2.3 మిలియన్ల మంది మహిళలు బాధ పడుతున్నారన్నారు. యుక్తవయస్సు తర్వాత ఏ వయస్సులోనైనా మహిళల్లో ఇది కనిపించవచ్చున్నారు. మారిన జీవన శైలి ఎన్నో ముప్పులను తెచ్చిపెడుతోందని, తీసుకునే ఆహారం, పర్యావరణ ప్రతికూలతలు మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ఫలితంగా ఎన్నో వ్యాధులు చుట్టుముడుతున్నాయన్నారు.

వాటిలో ప్రధానంగా చెప్పుకోదగినది క్యాన్సర్. మహిళలను వేధించే గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లు ఏటేటా పెరుగుతూనే ఉన్నాయన్నారు. క్రమం తప్పకుండా స్వీయ పరీక్షలు చేయించుకోవాలని, రొమ్ము కణజాలం లేదా ఛాతీ ప్రాంతంలో ఏదైనా అసాధారణతలను గుర్తించడానికి పురుషులు క్రమం తప్పకుండా స్వీయ పరీక్షలు చేయాలని అన్నారు. కుటుంబ చరిత్రపై అవగాహన ఉండాలని కుటుంబం క్యాన్సర్ చరిత్రను తెలుసుకోవడం, వైద్యుడితో చర్చించడం ముఖ్యమని, వైద్యులు అవసరమైతే ముందస్తు స్క్రీనింగ్ చేస్తారన్నారు. ఈ 5కె రన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. 5 కె రన్ లో మొదటి స్థానంలో నిలచిన చెల్లుబోయిన వెంకట ప్రదీప్ కు15 వేల రూపాయలు, రెండో స్థానంలో నిలచిన కిలపర్తి భాస్కర్ కు 10 వేల రూపాయలు, మూడో స్థానంలో నిలచిన ముదిలి శరత్ చంద్రప్రసాద్ కు 5 వేల రూపాయల చెక్కులను అందజేసారు.

# 3000 మందికి అన్నదాన వితరణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 20 :** రాజమండ్రి పేపర్ మిల్లు నుండి రాజీవ్ గాంధీ కాలేజీకి వెళ్లే దారిలో చింత చెట్టు ప్రక్కన ఉన్న కనకదుర్గమ్మ ఆలయం నందు దసరా ఉత్సవాల పూర్తయిన సందర్భంగా గుడి దగ్గర 3000 మందికి మహా అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు టి.కే. విశ్వేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఆలయ కమిటీ ఎంతో ఘనంగా, కన్నుల పండుగగా తొమ్మిది రోజులు దసరా ఉత్సవాలను నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందనిపేర్కొన్నారు. ఆ కనకదుర్గమ్మ అమ్మవారి దయ, అనుగ్రహాలు ప్రజలు అందరి మీద మెండుగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు మరియు సభ్యులు మాట్లాడుతూ శ్రీ కనకదుర్గ అమ్మవారికి దసరా తొమ్మిది రోజులు కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు చేసి భక్తులు కనకదుర్గ అమ్మవారి కృపా కటాక్షాలు పొందారని అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సి. హెచ్. ప్రసాద్, ఉపాధ్యక్షులు ఐ. శ్రీనివాస్, కార్యదర్శి వింజమూరి భాస్కర్ రావు, సహాయ కార్యదర్శి నవీన్ జోషి, స్వర్ణపుడి అప్పారావు, డి. సుబ్బారాయుడు, దూబ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు మరియు ఆలయ పూజారి కె. సోమ సుందరం మరియు భక్తులు పాల్గొన్నారు.

## 22న జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**రాజమహేంద్రవరం,పెన్ పవర్,అక్టోబర్ 20 :** అక్టోబర్ 22న ఉదయం 9 గంటలకు రాజానగరం ఎంపీడీవో కార్యాలయంలో నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తూర్పు గోదావరి జిల్లా నైపుణ్యభివృద్ధి అధికారి గంటా సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా ఉపాధి కల్పనా అధికారి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ జాబ్ మేళా లో మూడు కంపెనీలు పాల్గొననున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి హరిశ్చంద్ర ప్రసాద్ తెలియ చేశారు.

విద్యార్హతలు : ఎస్.ఎస్.సి /ఇంటర్/డిగ్రీ /డిప్లొమా, ఐ టి ఐ, బి/డి/యం ఫార్మసీ,ఎంబిఏ విద్యార్హతలు గల 19 నుండి 30 సం. వయసు వారికి ఇందులో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలియచేశారు. కాబట్టి జిల్లాలోని ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత, అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు అందరూ %ష్ట్రజూం://టశీతీఎం.స్త్రశ్రీ/9ఖీధ్గి52ఖస్త్ర8ళ్జఖజ ాణ%9 నందు తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయ్యి సదరు " జాబ్ మేళా" కు రెజ్యూమెలతో పాటు హజరు కావాలని కోరడం జరిగింది. ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో ఈనెల 22 వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో ఆఫీస్ రాజానగరం వద్దకు రావాలని వారు తెలియ చేశారు. మరిన్ని వివరాలకు 8328507473లేదా 7396740041 నంబర్ల ను కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

## యధావిధిగా మీకోసం- జిల్లా కలెక్టర్ ప్రశాంతి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 20 :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ అక్టోబర్ 21 న యధావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. అక్టోబర్ 21 సోమవారం "పి జి ఆర్ ఎస్ - మీ కోసం" ద్వారా ప్రజల నుంచి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, రెవెన్యు డివిజనల్ , మునిసిపల్, మండల స్థాయిలో అర్జీలను స్వీకరించడం కోసం అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. జిల్లా ప్రజలు, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని, మీ మీ అర్జీలని క్షేత్ర స్థాయిలో స్థానికంగా అందుబాటులో ఉండే డివిజనల్ , మునిసిపల్, మండల స్థాయి అధికారులకి అందచేయాలని కోరారు. ఆర్జి దారులు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కలెక్టరేట్ వద్ద కు రావద్దని కలెక్టరు ప్రశాంతి తెలియజేశారు.

# పండగలా సాగిన సిసి రోడ్లు శంకుస్థాపనలు...





**అనపర్తి,పెన్ పవర్,అక్టోబర్20** అనపర్తి నియోజకవర్గం లోని అనపర్తి, బిక్కవోలు మండలాలలోని పలు గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణాలకు, డ్రైనులకు, ప్రహరీ గోడల నిర్మాణాలకు శంకుస్థాపనలు ఒక వేడుకలా నిర్వహించారు. ఆదివారం పలు శంకుస్థాపనల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు అభివృద్ధికి ఆమడ దూరంలో గ్రామాలు ఉండిపోయాయని తిరిగి వాటిని అభివృద్ధి పథంలో నడిపించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు సంయుక్తంగా గ్రామాల అభివృద్ధికి కంకణం కట్టుకున్న కారణంగా పల్లె పండుగ పేరుతో ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు సుపరిపాలన అందించాలని లక్ష్యంతోనే ఎన్ని ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి సంక్షేమాన్ని నిర్వహించడమే ప్రధాన ప్రాధాన్యతగా తీసుకున్నరన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ గత ఐదేళ్లు చేసిన పాపాల వల్లే రాష్ట్రం తిరోగమనం పాలయ్యిందని అభివృద్ధి చేయాలనే పెద్ద మనసు అందరిలో ఉన్న ఖజానాను ఖాళీ చేసి వెళ్ళాడని ఆ ఇబ్బందిని తట్టుకుని బయటకు రావడానికి ఎన్నో వ్యయ ప్రయాసలోర్చాల్సి వస్తుందన్నారు. విజన్ ఉన్న చంద్రబాబు నాయుడు ఆలోచనలకు కేంద్ర ప్రభుత్వ సహకారం వలన ఈ 100 రోజుల్లో ఈ కాస్తంత అభివృద్ధి నైనా చేసుకో గలుగుతున్నామన్నారు. బిక్కవోలు మండలంలోని రెండు కోట్ల కోట్ల 41 లక్షలతో అనపర్తి మండలం లో 91 లక్షల రూపాయలతో శంకుస్థాపన నిర్వహించామని త్వరితగతిన ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలో పలు రోడ్లు, డ్రైన్స్, ప్రహరీ గోడల నిర్మాణానికి 14 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అనపర్తి మండలం పులగుర్త, కుతుకులూరు, పాలమూరు గ్రామాలలో, బిక్కవోలు మండలం తొస్సిపూడి, పందలపాక వూలపల్లి, బిక్కవోలు, ఇల్లపల్లి, రంగాపురం, బలబద్రపురం, కాపవరం గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రామకృష్ణారెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఒక పండుగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పుల్లా చంటియ్య కుటుంబాన్ని పరామర్శించిన చెల్లుబోయిన



**కడియపులంక, పెన్ పవర్, అక్టోబర్ 20 :** కడియపులంకలో ఇటీవల మృతిచెందిన శ్రీసత్యదేవ నర్సరీ రైతు, మాజీ పూల వర్తక సంఘం అధ్యక్షుడు పుల్లా సత్యనారాయణ (చంటియ్య) కుటుంబాన్ని శనివారం తూర్పు గోదావరి జిల్లా వై.ఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ పరామర్శించారు. చంటియ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పుల్లా చంటియ్య నర్సరీ రంగం కోసం ఎంతో కృషి చేశారని వారిరువురి మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పుల్లా సోదరులకు మరియు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో యాదల సతీష్ చంద్ర స్టాలిన్, తాడాల చక్రవర్తి, తిరుమలశెట్టి శ్రీను, ఈలీ గోపాలం, కొత్తపల్లి శివాజీ, బోడపాటి సత్తిబాబు, పాలపర్తి ప్రకాష్, కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## యూనియన్ బలోపేతానికి కృషి చేయండి

● నూతన కార్యవర్గం ఎన్నిక




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 20 :** యూనియన్ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చెయ్యాలని, వ్యాపారస్తుల సంక్షేమమే మనందరి ధ్యేయమని, వ్యాపారంలో ఖచ్చితత్వం అనేది తప్పనిసరిగా ఉండాలని నూతన అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి శశిధర్ మరియు కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. శనివారం స్థానిక గంటా గనిరాజు కళ్యాణమండపంలో ది రాజమండ్రి ఆటో కన్సుల్టేన్సీ మరియు ఫైనాన్సియర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని .

ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన ప్రెసిడెంట్ కర్రి శశిధర్, కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ట్రాఫిక్ కు ఏటువంటి అవాంతరాలు లేకుండా షాపుల వద్ద పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని, మున్సిపాలిటీ సిబ్బందికి, ట్రాఫిక్ పోలీసులకు సహకరించి వ్యాపారాలు కొనసాగించు కోవాలని పలు సూచనలు చేశారు. అనంతరం నూతన కార్యవర్గానికి గౌరవ అధ్యక్షులు, సభ్యులు అభినందనలు తెలియజేశారు.

నూతన కార్యవర్గ సభ్యులు...

ప్రెసిడెంట్ కర్రి శశిధర్, వైస్ ప్రెసిడెంట్ ఏలూరి సురేష్, సెక్రటరీ శీర్ల బ్రహ్మానందం, జాయింట్ సెక్రటరీ పడాల సత్తిబాబు, ట్రెసరర్ రవి చంద్ర శేఖర్ జైన్,డైరెక్టర్స్. శివపార్వతి ప్రసాద్, వనదుర్గ రాము, చిన్న బాషా, ఆర్.కే, డివివి ప్రసాద్, మారుతీ ఫైనాన్స్ రాఘవ, నాగార్జున, సతీష్, సురేష్ లను ఎన్నుకున్నారు.

# ఘనంగా హాస్య నటుడు రాజబాబు జయంతి వేడుకలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబరు 20:** నవ్వుల రారాజు,ప్రముఖ హాస్యనటుడు రాజబాబు 88వ జయంతి వేడుకలు ఆదివారం గోదావరి గట్టున ఉన్న రాజబాబు విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించి పేదలకు పండ్లు, స్వీట్లు,హాటు పంపిణీ చేశారు.రాజబాబు తమ్ముడు బాబి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలోబంధువులు, శ్రేయోభిలాషులు,నగర ప్రముఖులు హాజరై రాజబాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు.

రాజబాబు నటనలోని

ప్రత్యేకతను,వ్యక్తిగా ఆయన ఉన్నత వ్యక్తిత్వాన్ని వక్తలు కొనియాడారు.తమ్ముడు బాబి అన్నయ్య గురించి చెబుతూ పుణ్యమూర్తుల ఉమామహేశ్వరరావు,వెంకట రవణమ్మ దంపతులకు మొదటి సంతానంగా రాజబాబు 1936 అక్టోబరు 20 న నరసాపురంలో జన్మించారు.1960 సంవత్సరంలో సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 590 చిత్రాల్లో నటించి గొప్పపేరు ప్రఖ్యాతులతో హాస్యనటుడిగా అందరి హృదయాలలో నిలిచిపోయారు. చిన్న వయసులోనే ఎంతో తారాస్థాయికిచేరుకున్నారని,ఆయన తన పుట్టినరోజు నాడు మద్రాసు వాణి మహల్ లో సినీ పెద్దలకు సన్మానం చేసి కళలను గౌరవించేవారని,ఎన్నో అవార్డులు అందుకుని ఎన్నో గుప్త దానాలుచేసి చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.60 మందిని డిగ్రీ చదివించారు,70 మందికి పెళ్ళిళ్ళు చేసి ఇప్పటికీ గుర్తుంచుకునేలా నిలిచారు. 47 సంవత్సరాల చిన్న వయసులోనే ఆయన మన నుంచిదూరమయ్యారు.

ఆయన చనిపోయి 41 సంవత్సరాలైనా ఆయన నటించిన చిత్రాల ద్వారా పండించిన పాత్రల ద్వారా అందరి హృదయాలలో నిలిచి ఉన్నందున ఇప్పటికీ ఎప్పటికీ జనాలు గుర్తు చేసుకుంటూ ఉంటారు.రాజబాబు సినిమా అనేపదం ఉన్నంతవరకు రాజబాబు చిరంజీవే.ఆయన వరుసగా 11 ఫిలిం ఫేర్ అవార్డులు అందుకున్నారు.ఒక సంవత్సరంలో 35 చిత్రాల్లో అగ్ర హీరోలతో కలిసి నటించి రికార్డు సృష్టించారు.తోటి కళాకారులకు సన్మానం చేయడం, వారికి డబ్బు సహాయం చేయడం, వారికి సినిమా వేషాలు ఇప్పించడం ఆయనలోని గొప్పతనం,మంచితనం.రాజబాబుకు ముగ్గురు తమ్ముళ్ళు, ఐదుగురు చెల్లెళ్ళు ఉన్నారు.ఆయన భార్య లక్ష్మి అమ్మలు,కుమారులు నాగేంద్రబాబు,మహేష్ బాబు అమెరికాలో బాగా స్థిరపడ్డారు. కార్యక్రమంలో రాజబాబు మేనల్లుడు బీఎస్ఎన్ఎల్ వాసు, రాజబాబు మిత్రమండలి ముసిని వెంకటేశ్వరరావు (బాబులు), పట్నాయక్, గణేష్, లక్ష్మీనారాయణ (బాబి), మల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

# కళలను ప్రోత్సహిస్తా: బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,అక్టోబర్ 20:**కళలను ప్రోత్సహించడంలో తాను ముందు ఉంటానని ఎమ్మెల్యే శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో అంతర్జాతీయ సాహిత్య కళా వేదిక ప్రపంచంలో చాలా పెద్ద సాహిత్య సంస్థని తెలిపారు.ఈ హైటెక్ యుగంలో కళలకు విలువలు లేకుండా పోయిందని, ప్రజలు సినిమాలను ఎక్కువ ఆదరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సోషల్ నెట్వర్క్ వచ్చిన తర్వాత మరీ దిగజారిపోయిందనారు. టౌన్ హాల్ ని కట్టే ఉద్దేశం ఉందని, నియోజకవర్గం లో కళాకారులకు స్థల సేకరణ చేపట్టేలా త్వరలోనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

# మహిళలకు భద్రత కరువు. కూటమి ప్రభుత్వం వైఫల్యం.



**మండపేట. పెన్ పవర్.అక్టోబర్ 20:**రాష్ట్రం లో మహిళలకు భద్రత లేదని షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా పేర్కొన్నారు.మండపేట వైసిపి కార్యలయం లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కడప జిల్లా బద్వేల్ లో ఇంటర్ విద్యార్థి నీ పొదల్లో తీసుకు వెళ్లి నిప్పు పెట్టీ హతమార్చిన ఘటన దారుణమన్నారు. దీనిపై ప్రభుత్వం ఇప్పటి కి స్పందించలేదని దుయ్యబట్టారు.సాక్షాతూ మహిళా హోమ్ శాఖ మంత్రి వున్నప్పటికీ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం శాంతి భద్రతల పరిరక్షణ లో పూర్తిగా విఫలం అయిందనీ ఆరోపించారు. గతం లో వైఎస్ జగన్ హయంలో దిశా చట్టం కఠినం గా అమలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రం లో ప్రతి రోజూ ఏదో మూల హత్యలు, మానభంగాలు సర్వ సాధారణం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.మొన్న చిన్నారులపై అత్యాచారాలు, ఓ సి ఐ తల్లి నీ కిడ్నాప్ చేసి హత్య చేసిన ఘటన చోటు చేసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం అమలులోకి తెచ్చి ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని దుయ్యబట్టారు. ప్రతి పక్షం పై కేసులు పెట్టడం వున్న శ్రద్ధ శాంతి భద్రతల పై లేదని ఎద్దేవా చేశారు. కేవలం ప్రతి పక్షాన్ని అణచి వేయడానికి మాత్రమే హోమ్ మంత్రి పనిచేస్తున్నారని విమర్శించారు. బద్వేల్ ఘటన లో బాధితులను ఇప్పటికీ కూటమి నాయకులు ఎవరు పరమర్శించలేదని ఆరోపించారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తక్షణమే జోక్యం చేసుకొని బద్వేల్ ఘటన పై చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భాదిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

# ముంపులో డైలీ మార్కెట్ ప్రాంతం





**కాట్రేనికోన, పెన్ పవర్, అక్టోబర్ 20:** మండల కేంద్రమైన కాట్రేనికోన్ లో డైలీ మార్కెట్ ప్రాంతం వర్షం నీటితో నిండిపోయింది. కాట్రేనికోన పంచాయతీకి ఆదాయం ఇచ్చే ఈ ప్రాంతంపై నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుంది. ప్రతి శనివారం ఇక్కడ వారపు సంత జరుగుతుంది. సుదూర ప్రాంతాల నుండి వ్యాపారస్తులు తమ వస్తువులను ఎక్కడ అమ్ముతుంటారు కాట్రేనికోనతో పాటు ఇతర మండలాలకు చెందిన కొనుగోలుదారులు వస్తూ పోతూ ఉంటారు. దీంతోపాటు ప్రతిరోజు మార్కెట్ జరుగుతుంటుంది. కూరగాయలు చేపలు మాంసం వంటివి అమ్మకాలు జరుగుతాయి. కొద్దిపాటి వర్షానికి ఈ ప్రాంతం ముంపుకు గురవుతుంది. ఇక్కడున్న చెరువు ద్వారా నీరు ఓల్డ్ అయినాపురం డ్రైన్ లోకి వెళ్ళాలి. కొంతమంది అక్రమార్కులు ఈ మార్గాన్ని మూసివేసి కట్టడాలు నిర్మించడంతో వర్షం నీరు ఎక్కడికి అక్కడే నిలిచిపోతుంది. అప్పుడప్పుడు పంచాయతీ సిబ్బంది ఇంజన్ల ద్వారా ఈ నీటిని తోడే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఎందుకు కారణమైన ఆక్రమణల తొలగింపుకు మాత్రం వెనుకంజు వేస్తున్నారు. వర్షం నీరు నిలిచిపోవడం వల్ల ఈ ప్రాంతంలో తరచూ అంటు రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనితో పాటు దోమలు విపరీతంగా పెరగడంతో డెంగ్యూ మలేరియా వంటి రోగాలు కూడా సంక్రమిస్తున్నాయని వీరు అంటున్నారు. ఈ ప్రాంతం వర్షం వచ్చినప్పుడు మునిగిపోవడంతో వ్యాపారస్తులు తమ వ్యాపార లావాదేవీలను నిర్వహించలేకపోతున్నారు. ఆర్ అండ్ బి రోడ్డు పైకి తమ వ్యాపారాలను విస్తరిస్తున్నారు. దీని మూలంగా ట్రాఫిక్కు సమస్యలు ఏర్పడుతున్నాయి. ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నప్పటికీ స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలను తొలగించడంతోపాటు డ్రైనేజీని ఏర్పాటు చేయాలని వీరు కోరుతున్నారు. లేనియెడల ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు

# పట్ట బద్రులు ఓటు నమోదులో బూత్ కన్వీనర్లదే కీలక పాత్ర



**కొత్తపేట, పెన్ పవర్, అక్టోబరు20:**తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టబద్రుల ఓటు నమోదుకు సంబంధించి , కొత్తపేట మండలం మందపల్లి టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన క్లస్టర్ ఇంఛార్జిలు, బూత్ కన్వీనర్లు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల టిడిపి అధ్యక్షులు కంఠంశెట్టి శ్రీనివాసరావు,జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి బూసి భాస్కరరావు హాజరయ్యారు.వారు మాట్లాడుతూ
క్లస్టర్ వన్ పరిధిలో బూత్ కన్వీనర్లు ఓటు నమోదులో కీలకంగా వ్యవహరించాలని,పట్టబుద్రులు ఓటు నమోదు కు సంబంధించి ఓటరు అక్టోబర్ 31, 2021 లోపు డిగ్రీ పట్టా పొంది ఉండాలని, ఆధార్ కార్డు, 2 ఫోటోలు, ఓటర్ ఐడి నమూనాలను జతపరిచి సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల్లో అందించాలని కోరారు.అసెంబ్లీ ఎన్నికల మాదిరి కొత్తపేట సెగ్మెంట్లో టిడిపి బలపర్చిన అభ్యర్థికి అత్యధిక మెజార్టీ వచ్చేలా క్లస్టర్ వన్ పరిధిలో బూత్ కన్వీనర్లు పనిచేయాలని ముత్యాల బాబ్జి, బూసి భాస్కరరావు పిలుపునిచ్చారు.ఈసమావేశంలో 20 మంది బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

# వరదబాధితులకు జై గణేష్ టైలర్స్ యూనియన్ విరాళం



**గొల్లప్రోలు అక్టోబర్ 20 పెన్ పవర్ :** విజయవాడ వరద బాధితులకు జై గణేష్ ప్రాథమిక సహకార సంఘం( టైలర్స్ యూనియన్) విరాళం పంపించారు. గొల్లప్రోలులోని స్వామి వివేకానంద జ్ఞాన మందిరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు బత్తుల కొండలరావు మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల కోసం తమ యూనియన్ తరపున 6,760 రూపాయలు విరాళం రాష్ట్ర టైలర్స్ సొసైటీ అధ్యక్షుడు పోగులూరుమల్లికార్జున రావుకు పంపించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ పెనుగొండ రాజు, సెక్రటరీ కూరాకుల పాపారావు, కోశాధికారి సాధనాల రాము, జాయింట్ సెక్రెటరీకళ్యాణ్,వర్కింగ్ ప్రెసిడెంట్ టి త్రిమూర్తులు, జాయింట్ కోశాధికారి దాసం కొండబాబు,గుదే నాగేశ్వరరావు,వ ట్టూరి సత్యనారాయణ, గుండుబిల్లి నాగేశ్వరరావు,నీలం నాగేశ్వరరావు,కాకినాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

# గోతులు పూడ్చే కార్యక్రమంలో ఎస్సై సతీష్



**గోపాలపురం,పెన్ పవర్ అక్టోబర్ 20:**జాతీయ రహదారిపై గోతులు పూడ్చే పనిలో గోపాలపురం ఎస్సై కే.సతీష్ కుమార్ నిమగ్నం అయ్యారు.గ్రామ శివారులో కల్వర్టు వద్ద జాతీయ రహదారిపై ప్రమాద భరితమైన గోతులు ఏర్పడ్డాయి.రహదారిపై ప్రయాణం చేసే పలువురు ద్విచక్ర వాహనదారులు ఆ గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు.విషయం తెలుసుకున్న సతీష్ కుమార్ తన సిబ్బందితో కలిసి గోతులు పూడ్చే కార్యక్రమం చేపట్టారు.వాహనదారులు సురక్షితంగా గమ్యానికి చేరాలని రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఉండాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

# అలరించిన కోరుకొండ ప్రభ స్వర ప్రభంజనం

## సంగీత ప్రియులను ఉర్రూతలూగించిన సినీ సంగీత విభావరి





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబరు 20:** ఆమె గానం వీనులవిందు. ఆ గాత్రం సంగీత ప్రియులను తన్మయత్వంలో ముంచెత్తింది. సోగ్గాడు శ్రీ శోభన్ బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో వర్ధమాన గాయనీమణి కోరుకొండ ప్రభ 116 పాటలతో నిర్వహించిన"స్వర ప్రభంజనం" కార్యక్రమం సినీ సంగీత అభిమానులను మైమరిపించి ఉర్రూతలూగించింది.ఆహుతులందరూ గోదావరి తీరంలో అలల ఒడిలో సేద తీరేలా చేసింది. గతంలో 50 పాటలు పాడి అర్థశత గానప్రభ,75సినీ గీతాలు పాడి వజ్రామృత గానప్రభ బిరుదు పొందిన కొరుకొండ ప్రభ తాజాగా ఇప్పుడు నిర్వహించిన 116 పాటల సినీ సంగీత విభావరి రికార్డులకు ఎక్కిందని నిర్వాహకుడు, సంస్థ అధ్యక్షుడు దొండపాటి సుబ్రహ్మణ్యం తెలిపారు.కార్యక్రమంలో
పలువురు గాయనీ గాయకులు షేక్ మదరషా అలి,మల్లాది రాజేశ్వరరావు,బి.హెచ్.రామకృష్ణ, బోడపాటి శ్రీనివాస్,కొలుసు వెంకటేశ్వరరావు, ఎస్.ఎం.ఆర్.కిషోర్, చిర్ల నవీన్, కృష్ణవేణి, భారతి, సూర్యకుమారి, లక్ష్మి,శ్రీదేవి కూడా తమ గాత్ర మాధుర్యాన్ని పంచారు.ముఖ్య అతిథుల చేతుల మీదుగా తొలుత జ్యోతి ప్రజ్వలన జరిగింది. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ పూర్వ అధ్యక్షుడు పి.వి.ఎస్.
కృష్ణారావు, అల్లు బాబి, డాక్టర్ కంటే వీరన్న చౌదరి,లయన్ గుబ్బల రాంబాబు,బళ్ళ శ్రీనివాసరావు, జి.వి.రమణ, పతివాడ రామరాజు, యరక కొండబాబు, ఆకుల రాంబాబు, కసిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

# 26నుండి వారాంతంలో అధ్యాత్మిక ప్రయాణం

**–రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 20:**యాత్రికుల హృదయాలకు, మనస్సులకు అధ్యాత్మిక సాంత్వనను అందించేందుకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒక రోజు అధ్యాత్మిక ప్రయాణ పర్యాటక ప్యాకేజీని అక్టోబర్ 26న ప్రారంభించబోతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసనసభలో పలువురు ఎమ్మెల్యేల సూచనల మేరకు వారాంతంలో ఉమ్మడి తూర్పుగోదావరిలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలు, పంచారామ క్షేత్రాలను కలిపేలా ఒక రోజు టూర్ ప్యాకేజీకి ప్రణాళిక రూపొందించామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఈ మేరకు మంత్రి కందుల దుర్గేష్, ఛైర్మన్ నూకసాని బాలాజీ, టూరిజం శాఖ ఉన్నతాధికారులు, బోర్డ్ డైరెక్టర్ల చేతుల మీదుగా బస్సులు ప్రారంభించునున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ టూర్ ప్యాకేజీ వివరాలను వివరించారు.
ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పర్యాటకానికి ముఖద్వారమైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలుత అత్యంత ప్రసిద్ధి చెందిన పురాతన క్షేత్రమైన కోరుకొండ స్వయం భూ శ్రీ లక్ష్మీ నర్సింహాస్వామి దేవస్థానం దర్శించిన అనంతరం రత్నగిరి కొండపై వెలసి భక్తుల కోరికలు తీరుస్తూ కొంగు బంగారంగా నిలిచిన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయ దర్శనం, ఆ తర్వాత పితృముక్తి క్షేత్రంగా, పాదగయ తీర్థంగా పేరొందిన పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వరస్వామి ఆలయం దర్శించిన పిమ్మట విశాలమైన ప్రాకారాలతో, చాళక్యుల శిల్పకళా నైపుణ్యంతో అలరారుతూ పంచారామ క్షేత్రాల్లో ఒకటైన సామర్లకోటలోని శ్రీ చాళుక్య కుమారరామ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయాన్ని యాత్రికులు దర్శించుకొంటారని తెలిపారు. సామర్లకోట దేవాలయంలో మధ్యాహ్నం అన్న ప్రసాదాలు స్వీకరించిన అనంతరం అత్యంత ప్రాచీన మహిమాన్విత శివ లింగ క్షేత్రం ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి ఆలయాన్ని యాత్రికులు సందర్శిస్తారని తెలిపారు. ఆ తర్వాత కోనసీమ తిరుపతిగా, ఏడు శనివారాల వెంకన్న దేవుడిగా భక్తులచే కీర్తి పొంది విశేషంగా ఆకట్టుకుంటున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని యాత్రికులు సందర్శించేలా ఒక రోజు టూర్ ప్యాకేజీని నిర్ణయించామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. అక్టోబర్ 26 నుండి బస్సులు పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.
రాజమహేంద్రవరంలోని సరస్వతీ ఘాట్ వద్ద పర్యాటక శాఖకు సంబంధించిన ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం (ఐఆర్ఓ) వద్ద ప్రతి శనివారం ఉదయం 6 గంటలకు బయలుదేరే పర్యాటకుల బస్సు కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం, వాడపల్లి ఆలయాల మీదుగా రాత్రి 7.00 గంటలకు రాజమహేంద్రవరంలోని హేవలాక్ బ్రిడ్జి దగ్గర పుష్కర్ ఘాట్ కు చేరుకుంటుందన్నారు. అక్కడే పవిత్ర గోదావరి నదికి కన్నుల పండువగా హారతి ఇచ్చే ప్రాంతంలో మంత్ర ముగ్ధ దృశ్యాలను భక్తులు తిలకించేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. భక్తులు అధ్యాత్మిక ప్రపంచంలో మునిగి తేలేలా కార్యక్రమం పూర్తయిన అనంతరం 7.30 గంటలకు తిరిగి రాజమహేంద్రవరంలోని ఏపీటీడీసీకి చెందిన ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం వద్దకు భక్తులను చేరవేస్తామన్నారు. ఇంతటితో యాత్ర సమాప్తమవుతుందన్నారు. వివరాలకు యాత్రికులు ఐఆర్ఓను సంప్రదించాలని తెలిపారు. 18 మంది సీటింగ్ సామర్థ్యంతో బయలుదేరే బస్సు ఆద్యంతం ప్రకృతి రమణీయత దృశ్యాల నడుమ ప్రయాణించేలా ప్రణాళిక రూపొందించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెడుతున్న ఈ అధ్యాత్మిక యాత్ర భక్తులకు మానసికోల్లాసాన్ని కలిగించి అధ్యాత్మిక భావనను పెంచుతుందని భావిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు పర్యాటక శాఖ సన్నాహాలు చేస్తుందని వెల్లడించారు. భక్తుల కోరిక మేరకు 18 మంది సమూహంతో పర్యాటక శాఖను సంప్రదిస్తే ప్రయాణం ఏర్పాటు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పెద్దలకు రూ.1000, 3-10 ఏళ్లలోపు చిన్నారులకు రూ.800 టూర్ ఛార్జీగా నిర్ణయించామన్నారు. ప్రకృతి రమణీయత, అధ్యాత్మిక కలయికతో కూడిన టూర్ ప్యాకేజీని యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ కోరారు. అధ్యాత్మిక భావంతో పాటు సాంస్కృతిక, చారిత్రాత్మిక ప్రదేశాలకు మరింత వెలుగులు అద్దడమే టూర్ ప్యాకేజీ ముఖ్యోద్దేశమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు ఫుల్... వైద్య సేవలు నిల్

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, అక్టోబర్ 20:**లక్షలాది రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు కరువయ్యాయి. ఆసుపత్రికి వచ్చి రోగులకు వైద్య సేవలు కనుమరుగయ్యాయి. ఈ ఆస్పత్రి నియంత్రించే అధికారులు కనిపించడం లేదు. దీంతో డాక్టర్లు గాని ఆసుపత్రి వైద్య సిబ్బంది గాని తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు రోగుల నుండి వారి బంధువుల నుండి బలంగా వినిపిస్తున్నాయి. అయినా డాక్టర్లు గాని వైద్య సిబ్బంది లో గాని వారి ప్రవర్తనలో ఎటువంటి మార్పులు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులు నానా ఇక్కట్లు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు వైద్య సేవ అందించే నిమిత్తం పూర్తిస్థాయిలో డాక్టర్లను వైద్య సిబ్బందిని నియమించింది అయినా వారు వైద్య సేవలు అందించడానికి ముందుకు రావడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఆస్పత్రిలో వచ్చే ఆరోపణలు విమర్శలపై గత నెలలో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి గూడెం వచ్చి ఆసుపత్రిలోని ప్రతి వార్డును పరిశీలించారు. అయితే కలెక్టర్ పరిశీలనకు వస్తున్నారనే సమాచారంతో ఆస్పత్రి సూపరిండెంట్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆసుపత్రిని అందంగా తీర్చిదిద్దారు. ప్రతి వార్డులో తెరలు కట్టారు. దుర్వాసన రాకుండా సుగంధ ద్రవ్యాన్ని చల్లారు పిచికారి చేశారు. అయితే ఆసుపత్రి ని అందంగా పరిసరాలను పరిశుభ్రంగా వార్డులను తీర్చిదిద్దడం పరిశీలించిన కలెక్టర్ ఆస్పత్రిలోని డాక్టర్ల వైద్య సిబ్బంది పనితీరు బేషుగా ఉందని విలేకరుల వద్ద కితాబిచ్చారు. కలెక్టర్ మాటలు విన్న విలేకరులు స్పందించి ఆస్పత్రిలో ఎటువంటి వైద్య సేవలో అందడం లేదని డాక్టర్లు ప్రైవేటు వైద్యం చేసుకుంటున్నారని, మధ్యాహ్నం అయితే ఒక్క డాక్టర్ కూడా ఆసుపత్రిలో ఉండడం లేదని ఫిర్యాదు చేసారు. దీంతో విషయాన్ని గ్రహించిన కలెక్టర్ వెంటనే ఆసుపత్రిలో ఉన్న డాక్టర్లందర్నీ సమావేశపరిచి రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.




ఈ సమయంలో స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కూడా అక్కడే ఉండడం విశేషం. అయినా డాక్టర్లు గాని వైద్య సిబ్బంది గాని వారు మాటలు బేఖాతర్ చేయడం లేదనేది శుక్రవారం రాత్రి జరిగిన సంఘటన ఉదాహరణగా చెప్పవచ్చు. తాడేపల్లిగూడెం మండలం ఎల్ అగ్రహారానికి చెందిన డెలివరీ నిమిత్తం మూడు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరింది. ఆమెను పరీక్షలు చేసిన గైనకాలజిస్ట్ శకుంతలకు ఇప్పట్లో డెలివరీ కాదని చెప్పారు. అయితే శుక్రవారం రాత్రి ఆమెకు పురిటి నొప్పులు రావడంతో శకుంతల తల్లి డ్యూటీ నర్సు వద్దకు వెళ్ళి పరిస్థితి ని తెలిపింది. అయినా ఎవరు రాకపోవడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది . అంతేకాకుండా డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బంది అభ్యంతరకరంగా మాట్లాడారని బాధితులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో డాక్టర్లు గానీ నర్సులుగాని లేకుండానే గర్భిణీ ఆసుపత్రిలో ఉన్న బెడ్ పై ప్రసవించింది. అప్పటికి కూడా డాక్టర్ గాని వైద్య సిబ్బంది గాని రాలేదు. ఆ సమయానికి శిక్షణ నిమిత్తం వచ్చిన నర్సింగ్ విద్యార్థినిలు మంచంపై డెలివరీ అయిన శకుంతలను ఆమె బిడ్డను తీసుకుని మెటర్నిటీ వార్డుకు తరలించారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యనారాయణ మాట్లాడుతూ సంఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కంటి తుడుపు సమాధానికి ఇవ్వడం పట్ల విమర్శలు అర్థమవుతున్నాయి. అంతేకాకుండా వైద్య సేవలను వచ్చి రోగులకు రాసి చీటీ విషయంలో కూడా రిసెప్షన్లో ఉన్న వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో రోగులపట్ల డాక్టర్లు, వైద్య సిబ్బంది పనితీరు పై విచారణ చేసి మెరుగైన సేవలందించే విధంగా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

## లాడ్జీలను పరిశీలించిన జగ్గంపేట సిఐ



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబరు 20** : జగ్గంపేట లోని శ్రీ లక్ష్మీ లాడ్జి, గండేపల్లి మండలంలో జడ్.రాగంపేట గ్రామ శివారున బాలాజీ, మోహన్ సాయి కృష్ణ లాడ్జీలను ఆదివారం జగ్గంపేట సీఐ వైఆర్ కె శ్రీనివాస్ పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనుమానిత వ్యక్తులకు, భార్యాభర్తలు కాని వారికి రూములు ఇవ్వరాదన్నారు. లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు చేపడితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## గండేపల్లిలో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**జగ్గంపేట(గండేపల్లి), పెన్ పవర్, అక్టోబరు 20:** గండేపల్లి జాతీయరహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం లో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించి స్థానికుల కథనం మేరకు గండేపల్లికి చెందిన కాజులూరి రమణ(60) జాతీయరహదారిపై ఎస్ బి ఐ బ్యాంకు వద్ద రోడ్డు దాటుతుండగా రాజమండ్రి వైపు నుంచి జగ్గంపేట వైపు వెళ్లే వ్యాన్ ఢీకొట్టింది. దీంతో రమణ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన ఎస్ఐ యువి శివనాగబాబు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. దీనిపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.



## వసతి గృహాలను తనిఖీ చేసిన న్యాయమూర్తి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, అక్టోబర్ 20:**పట్టణంలోని పలు హాస్టళ్లను న్యాయమూర్తి తనిఖీ చేశారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, రెండవ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా ఈ తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ బాలుర కాలేజీ హాస్టల్ లను, ప్రభుత్వ బాలికల హాస్టలను పరిశీలించారు. ఆయా హాస్టళ్ల వార్డెన్లతో న్యాయమూర్తి మాట్లాడారు. వసతి గృహాల స్థితిగతులను భోజనశాలను రిజిస్టర్లను బాత్రూమ్ లను వంట గదులను జడ్జి పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఇతనికి లో బార్ అసోసియేషన్ న్యాయవాది లోకేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో యధావిధిగా గ్రీవెన్స్ కార్యక్రమం కలెక్టర్.



**అమలాపురం, పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 20:**జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి యధావిధిగా అమలాపురం కలెక్టరేట్ లోని గోదావరి భవన్లో జరుగునని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్ మండల స్థాయిలో కూడా యధావిధిగా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు

## అధిక వేగం ప్రాణాలకు ముప్పు



● గంగవరం ఎస్సై భూషణం

**గంగవరం ,పెన్ పవర్, అక్టోబర్ 20:** వాహనాలు అధిక వేగంతో నడపడం వల్ల ప్రాణాలకు ముప్పు అని గంగవరం ఎస్సై భూషణం అన్నారు. ఆదివారం ఆయన కుసుమరాయి జంక్షన్లో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాద సంభవిస్తాయని దీనివల్ల కుటుంబాల రోడ్డును పడతాయి అన్నారు. పంట పొలాల్లో కోసం విద్యుత్ వైర్లు అమర్చడం ప్రమాదమని అటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు . అలాగే మోటార్ వెహికల్ చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా రికార్డును ఉంచుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులు యువత లోన్ యాప్ లను ఉపయోగించడం వల్ల మోసాలకు గురి అవుతున్నారని సైబర్ క్రైమ్ విషయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు .

## ఘనంగా వాసంశెట్టి పుట్టిన రోజు వేడుకలు



**కాజులూరు,పెన్పవర్,అక్టోబర్20:**రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం పుట్టిన రోజు వేడుకలను మంత్రి నివాసంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.కాజులూరు మండలానికి చెందిన గుబ్బల ఏసురాజు,మేక సురేష్,(నీలిమా డ్రై ఫ్రూట్స్) సుబ్రహ్మణ్యం,బంధనపూడి సర్పంచ్ దేగల తిరుమల వేణి, దేగల సత్యనారాయణ,నున్న కాశీ,కోకా హరి,ధరణి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అలాగే కూటమి నాయకులు కోట తాతబ్బాయి,బొండా వెంకన్న,దేగల సతీష్,పెంకే అప్పారావు, వల్లు అర్జనరావు,కోలంక సర్పంచ్ గుబ్బల మౌనిక,వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, అధికారులు, కూటమి నాయకులు



తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 20 :**రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద గోదావరి నదిలో సుమారు 55 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఉండడంతో స్థానికుల సమాచారం మేరకు మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్సీ వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలు తెలిసిన ఒక 9440796532 తెలియపర్చాలని సి.ఐ. అప్పారావు తెలిపారు.

## ఊరు చివరనే మద్యం షాపు ఉండాలి.

సిపిఐ డిమాండ్.



**కూనవరం,పెన్ పవర్,అక్టోబర్ 20.**కూనవరం మద్యం షాపు గత ప్రభుత్వం కూనవరం,టేకుల బోరు ఊళ్లో కాకుండా టేకుల బోరు ఊరు చివరన ఏర్పాటు చేసింది ప్రస్తుతం ఉన్నచోట మద్యం షాపును ఏర్పాటు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి లంబు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గతంలో కూనవరంలో ఉన్న పాత మద్యం షాపు పక్కనే చర్చి, ఎదురుగా బస్టాండు ఆ పక్కనే మసీదు ఎదురుగా బాలికల వసతి గృహం ఉన్నాయని ఆయన అన్నారు.రాజకీయ ఒత్తిళ్లకు భయపడి అక్కడే పెడితే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలన చేసి,పరిసరాలను పరిశీలించి అక్కడ క్రైస్తవుల,ముస్లింల దేవా ఆలయాలకు సంబంధించిన భక్తుల మనోభావాలను, గ్రామ ప్రజల మనోభావాలను తెలుసుకొని నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు. గత ప్రభుత్వం గతంలో ఊరి చివరన మద్యం షాపు పెట్టి భక్తులకు, మహిళలకు, విద్యార్థులకు, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఒక మంచి నిర్ణయాన్ని కాదని కూనవరం నడిబొడ్డున మద్యం షాపు పెట్టడం మంచి నిర్ణయం కాదని సంకుచిత బుద్ధిని విడనాడి మంచిని ఆహ్వానించాలని అన్నారు.

## ముత్యాలమ్మ అమ్మవారి ఊరేగింపు



**గోపాలపురం,పెన్ పవర్ అక్టోబర్ 20 :**నియోజకవర్గంలోని నల్లజర్ల మండలం చోడవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అంగరంగ వైభవంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు అభిషేకాలు లలిత సహస్రనామాల పారాయణం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు మంగళ వాయిద్యాలు కరగ నృత్యాల మధ్య అమ్మవారిని ఊరేగించారు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు

## ఘనంగా అమ్మవారి ఊరేగింపు



**గోపాలపురం, పెన్ పవర్, అక్టోబర్ 20.** నియోజకవర్గంలోని దేవరపల్లి గ్రామ శివారులో యాదవోలు వెళ్లే రహదారి దగ్గర ఉన్న శ్రీ సౌభాగ్య దుర్గాంబిక అమ్మవారి ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని సౌభాగ్య దుర్గంబిక అమ్మవారికి కుంకుమ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, బాణాసంచా కాల్పుల మధ్య అమ్మవారు ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు, గ్యాలం సత్యనారాయణ, చిట్లు వెంకటేశ్వరరావు కవల బాబూరావు, కవల సత్యనారాయణ, కల్లేపల్లి మాణిక్యం, కవల వెంకన్న నాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నాడు నేడు పనుల నిర్వహణపై ఎమ్మెల్యే కు ఫిర్యాదు.

**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 20:**ఆలమూరు బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నాడు నేడు పనులు లో జరుగుతున్న జాప్యం నిధుల ఖర్చులు జరుగుతున్న విధానాలపై విద్య కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. విద్యా కమిటీ చైర్మన్ ఇందుగుల సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో కమిటీ ఫిర్యాదు పత్రాన్ని ఎమ్మెల్యే బండారుకు అందజేశారు. నాడు నేడు నిధులు నాలుగు నెలల క్రితమే బ్యాంకు నుంచి విత్ డ్రా చేసి వాటిని ఖర్చు చేయకుండా ఉంచారని ఆరోపించారు. పనులు అసంపూర్తిగా నిలిపివేయడంతో పాఠశాల ఆవరణలో నీరు నిలిచిపోయి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యంగా వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం జరుగుతుందని దీనిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యా కమిటీ కోరింది. నాడు నేడు నిధులపై వచ్చిన ఆరోపణలను తక్షణం విచారణ చేసి చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీడీవో జోన్ లింకన్ కు ఫిర్యాదు కాపీని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అందజేశారు.

# మానవతాకి ఫ్రీజర్ బహుకరణ



**గోపాలపురం, పెన్ పవర్, అక్టోబర్ 20.** దాతల సహకారంతో మండల మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సంస్థ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. చిట్యాల గ్రామానికి చెందిన స్వర్గీయ కొండేపాటివీర కృష్ణ జ్ఞాపకార్థం ఆయన మనవళ్లు మనవరాళ్లు అయినవీర వెంకట సతీష్ కుమార్, వీర వెంకట ప్రదీప్ కృష్ణ, ముత్యాల ఉదయ్, శంకర్నాథ్, జయపట్టాభి రామన్న, చింతపల్లి రాధికలు ఔదార్యంతో 80 వేల రూపాయలు నగదు ఫ్రీజర్ నిమిత్తం ఏర్పాటు చేశారు. ఈ మొత్తాన్ని కొండేపాటి దేవి పుష్పావళి రత్నాజీ చౌదరి దంపతులు మానవతా చైర్మన్ రాంబాబుకు ఆదివారం అందజేశారు. సంస్థకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ముందు ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గెడా జోగేంద్ర ప్రసాద్, రాధాకృష్ణ, కుక్కల కీర్తి కుమార్, కోయ్య నాగరాజు, జుత్తిగ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎంఎల్ఏ పర్యటన వివరాలు

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, అక్టోబర్ 20:**
స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సోమవారం నియోజకవర్గంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.
మండలంలోని పట్టింపాలెంలో ఉదయం 8 గంటలకు శ్రీకృష్ణ ఆలయానికి శంకుస్థాపన చేస్తారు. పదిన్నర గంటలకు
పెంటపాడు మండలం వల్లూరుపల్లి గ్రామంలో జరిగే పల్లె పండుగలో పాల్గొని సిసి రోడ్లు, డయిన్ పనులను ప్రారంభిస్తారు. అనంతరం భూ సమస్యల పరిష్కార నిమిత్తం ఏర్పాటు చేసే రెవెన్యూ సదస్సులో పాల్గొంటారు.పదకొండునర గంటలకు పరిమళ్ళ గ్రామంలో సిసి రోడ్లు , డ్రెయిన్ల పనులకు శంకుస్థాపన చేసి, పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపులో ఎమ్మెల్యే పాల్గొంటారు.

# తాటి ఆకుల గూడెంలో గోకుల షెడ్డు కు శంకుస్థాపన



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, అక్టోబర్ 20 :**పాడి రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీతో గోకుల షెడ్డులను నిర్మించు కొని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్ సూచించారు. ఆదివారం తాటి ఆకుల గూడెం గ్రామంలో గోకుల షెడ్డు కు శంకుస్థాపన చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కొరకు కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 25 వేల గోకుల షెడ్లను మొదటి దఫాగా మంజూరయ్యాయని ఆయన తెలిపారు. రైతుల అభివృద్ధికి ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,పోలవరం ఎమ్మెల్యే చి రి బాలరాజు కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నా తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనమా రాంబాబు, జనసేన, టిడిపి మండల అధ్యక్షులు పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, పీ అంకంపాలెం ఎంపీటీసీ నాలి శ్రీను, బీసీ నాయకులు మేకల మంగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహిళలకు ఉచిత బస్సు ఏది ? ఎన్డీఏ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కొండేటి





**పి గన్నవరం/అమలాపురం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 20:**కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో మహిళలకు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన ఉచిత బస్సు సౌకర్యం వెంటనే అమలు చేయాలని నగరం నుండి బోడస్కూరు వరకు మహిళలతో బస్సులో ప్రయాణం చేసి నిరసన తెలిపారు . సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని మీరు ప్రకటించిన పథకాలు నమ్మి ప్రజలు ఓటు వేసి గెలిపించారని వెంటనే ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని జిల్లా అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి, జిల్లా బీసీ సెల్ చైర్మన్ కుడుపూడి శ్రీనివాస్, మహమ్మద్ ఆరీఫ్, మాచవరపు శివన్నారాయణ, అప్పన శివరామకృష్ణ, మొల్లేటి వెంకటేశ్వరరావు, కొండేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# మోడీ సహకారంతో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందడుగు: మంత్రి నిమ్మల





## లోటు బడ్జెట్ ఉన్నను రాష్ట్ర అభివృద్ధికి డోకా లేదు

**పోడూరు, పెన్ పవర్, అక్టోబర్ -20:**ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహాయ సహకారాలతో రాష్ట్రం అన్ని రంగాలలో ముందంజలో ఉందని, లోటు బడ్జెట్ ఉన్నను సంక్షేమం అభివృద్ధికి ఎక్కడ డొక్కా లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.
ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం బూరుగుపల్లి, దొడ్డిపట్ల గ్రామాల్లో పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా రూ 35 లక్షల విధులతో వివిధ అభివృద్ధి పనులకు, జిల్లా పరిషత్తు చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణిలతో కలసి భూమి పూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పూజ్య బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం - నేడు పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రాష్ట్ర అభివృద్ధి చేకూరుతుందన్నారు గత ప్రభుత్వంలో పంచాయతీలను నిర్వీర్యం చేసి సర్పంచులను భిక్షాటన చేసేలా చేస్తే నేటి ప్రభుత్వం పంచాయతీల ఆర్థిక పరిపుష్టిని పెంచి పాలకవర్గాన్ని తలెత్తుకునేలా చేసామన్నారు.గత వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నిధులను పక్కదారి మళ్లించి స్థానిక సంస్థలను పనికిరాని చేసిందన్నారు.జిల్లా పరిషత్తు చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం,రాష్ట్రం అభివృద్ధి చెందుతాయన్నారు.గతంలో గ్రామ పంచాయతీలకు నిధులు లేక కనీసం బ్లీచింగు,సున్నం కూడా వేసుకోలేని పరిస్థితి ఉండేదన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పంచాయతీ పరిస్థితులను అర్థం చేసుకుని రాష్ట్రంలో అన్ని పంచాయతీలకు స్వంత డబ్బులను ఒక్కొక్క పంచాయతీకి ఒక లక్ష రూపాయలు చొప్పున అందజేయడం మంచి శుభ పరిణామం అన్నారు. పాలకొల్లు నియోజకవర్గ ప్రజలు గొప్ప అదృష్ట వంతులని మంచి నాయకుడిని ఎన్నుకుని నియోజకవర్గ అభివృద్ధికి మంచి బాటలు వేసుకున్నారన్నారు.గతంలో పాలకొల్లు నియోజకవర్గానికి ఎలక్షన్ ప్రచారానికి వచ్చానని, ఎక్కడికి వెళ్లినా, కనీసం మా బంధువులను కలసి ఓటు అడిగినా నిమ్మల రామానాయుడుకే ఓటు వేస్తామని చెప్పారని అప్పుడు తెలిసింది మంచి ప్రజా నాయకుడు అని అన్నారు.జిల్లా పరిషత్తు చైర్పర్సన్
ఘంటా పద్మశ్రీ అన్నారు.జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పల్లె సీమలను ప్రగతిబాటలో నడిపేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు,మాజీ శాసన మండలి సభ్యులు అంగర రామ్మోహన్, డ్వామా పిడి డా. కె.సి.హెచ్.అప్పారావు, జిల్లా పంచాయతీ రాజ్ ఇఇ కె.యస్.యస్.శ్రీనివాస రావు, తహశీల్దారు గ్రంథి పవన్, యంపిడివో యన్. ప్రేమాన్విత, వివిధ శాఖలు అధికారులు, గ్రామ సర్పంచులు చెల్లుబోయిన ప్రమీల కుమారి, చెల్లింకుల లక్ష్మి, నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బోణం చినబాబు, చిట్టూరి సీతారామాంజ నేయులు, బొప్పన హరి కిషోరు,మాత రత్నం రాజు, అరిమిల్లి రామ శ్రీనివాసు, బన్ని వాసు, ముచ్చర్ల శ్రీనివాస రావు, బోనంనాని,రుద్రరాజు సత్యనారాయణ రాజు,పీతల శ్రీనివాసు, దేగల సత్తిపండు, గుబ్బల మోహన్, రేఖపల్లి వెంకట రెడ్డి నాయుడు, కొడవటి వరబాబు, తాళ్ళ నాగరాజు, పాలవలస తులసీ రావు,టిడిపి,బిజెపి, జనసేన నాయకులు, ఎక్కువ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వాడపల్లి క్షేత్రం

## స్వామివారి సుందర ప్రతిమలతో భారీ గేట్లు









**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 20:**కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ చందన వెంకటేశ్వర స్వామి అలివేలుమంగా పద్మావతి క్షేత్రానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. భక్తులతో నిత్యం కిటికీటలాడే ఈ క్షేత్రానికి సోమవారం నుండి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వారం రోజుల పాటు జరగనున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయమంతా మిరుమిట్లు కొల్పే విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామివారి అమ్మవారిల వసంత మండపానికి చామంతి, బంతి, సుగంధాన్ని వెదజల్లే ఉద్యాన పువ్వులతో ఎంతో సుందరవణంగా ఆలయాన్ని తీర్చిదిద్దారు. బ్రహ్మోత్సవాలులో పాల్గొనడానికి వచ్చిన భక్తులకు ఆలయ సన్నిధిలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. కోనసీమ తిరుమల వాడపల్లి చందన వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రతి ఒక్క భక్తుడు తిలకించాలని ఉద్దేశంతో ముఖ్యమైన ప్రదేశాలలో ఎల్ఈడి స్క్రీన్లను ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో స్వామి వారి బ్రహ్మోత్సవ ముఖద్వారాన్ని ఏర్పాటు చేశారు. అలాగే బొబ్బర్లంక బ్యారేజ్ దిగువన సుందరంగా ముఖద్వారం ఏర్పాటు చేసి స్వామి వారి ప్రతిమలను భక్తులు తిలకించే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వార్షిక బ్రహ్మోత్సవాలు నలుమూలలకు చాటి చెప్పే విధంగా ఏర్పాటు చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ ఎన్.ఎస్. చక్రధర్ రావు,తెలిపారు.

# కవిశ్రేష్ఠ డా. బాలచందర్ కు సత్కారం

## నాలుగు ప్రపంచ రికార్డులతో ప్రత్యేక గుర్తింపు



**పోడూరు, పెన్ పవర్, అక్టోబర్ -20:**
పెనుగొండ ఎస్ వి కె పి, పి వి జూనియర్ కళాశాల తెలుగు శాకాధిపతి ఏ జి ఎం సి చైర్మన్ కవి శ్రేష్ట డాక్టర్ .బాలచందర్ సాదేకు నాలుగు ప్రపంచ రికార్డులను దక్కించుకున్నందుకు ఘన సత్కారం లభించింది.ఐ యస్ ఓ గుర్తింపు పొంది 29వ వరల్డ్ రికార్డు కవిసమ్మేళనం - కళాజాతర 24 గంటల కార్యక్రమం శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ చైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్ సారధ్యంలో తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాలులో శనివారం సాయంత్రం 4.00 గంటల నుండి ఆదివారం సాయంత్రం 4.00 గంటల వరకు అత్యంత వైభవోపేతంగా జరిగింది.ఈ కవి సమ్మేళనంలో డా. బాలచందర్ సాదే హాజరై కవితాలాపన చేసి సభను రంజింపచేశారు డా. బాలచందర్ మాతృభాష, కళా, సంస్కృతి,- సాంప్రదాయాల అభివృద్ధికి సాహిత్యం, కళల ద్వారా చేస్తున్న కృషిని అభినందిస్తూ తెలుగు సాహితీ చరిత్రలో 24గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన రికార్డుగా గుర్తించి 'అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు' 'ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డు','టి ఎన్ ఏ బుక్ ఆఫ్ రికార్డు', 'కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డు'లలో బాలచందర్ పేరు నమోదు చేస్తూ ఘనంగా సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అంతర్జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి జాతీయ అధ్యక్షురాలు జి ఈశ్వరీ భూషణం ప్రధాన కార్యదర్శి పార్థసారథి, కార్యవర్గ సభ్యులు బాలచందర్ కు ప్రశంసాపత్రం అందించినట్లు ఆయన విలేకరులకు తెలిపారు ఈ సందర్భంగా డా. బాలచందర్ కు కళాశాల పాలకవర్గం ప్రిన్సిపాల్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

# సముద్రపు తీరా ఇసుకను తవ్వేస్తున్న ఇసుక మాపియా



**కాట్రేనికోన, పెన్ పవర్, అక్టోబర్ 20:**
కాట్రేనికోన మండల కేంద్రం గా ఇసుక మాపియా రెచ్చిపోతుంది. ప్రకృతి వై పరీత్యాలు, సునామీ లు సంభవించినపుడు ఇసుక తెన్నెలు రక్షణ కవచం గా నిలుస్తున్నాయి. కాట్రేనికోన గ్రామపంచాయతీ పరిధిలో కూనవరం మొగ సముద్ర తీరం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న తెలుగు తమ్ముళ్లు.కాట్రేనికోన అనధికార లే ఔట్ లకు ఇసుకను తరలిస్తున్నారు. యదేచ్చగా ఇసుక తరలిస్తున్న సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో సంబంధిత అధికారుల అండదండలతో
రెచ్చిపోతున్న ఇసుక మాఫియా రెచ్చి పోతున్నారు. బరితెగించిన తెలుగుతమ్ముళ్లు...అధికారం మధంతో తీరంలోని ఇసుక తరలించేస్తున్నారు. సముద్రపు ఇసుకను కాట్రేనికోనకు చెందిన కొంతమంది తెలుగుతమ్ముళ్లు విచ్చలవిడిగా పెద్ద పెద్ద లారీలతో లే ఔట్ లకు తరలించేస్తున్నారు.దీనిలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి సుమారు నాలుగు లారీలతో ఒక జె సి బి తిరప్రాంతంలో మకాం వేశారు.ఈ విషయంపై రివెన్యూ, ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చినా నోరు మేధపడం లేదు. సి ఆర్ జెడ్ పరిధి లో 500 మీటర్లు నుండి 2వేలు మీటర్లు వరకు సముద్ర పు ఇసుక గుప్పెడు కూడా తీయకూడదనే నిబంధనలు సుప్రీం కోర్ట్ నుండి కచ్చితమైన అదేశాలు ఉన్నా పట్టించు కున్న దాక లాలు లేవు..

# కోలంకలో సీసీరోడ్డుకు మంత్రి శంకుస్థాపన





**కాజులూరు,పెన్‌పవర్,అక్టోబర్20:**మండల పరిధిలోని కోలంక గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపన చేశారు. అలాగే మంలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఆయన కొబ్బరికాయ కొట్టారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాజులూరు మండలానికి సంబంధించి పల్లెపండుగ కార్యక్రమంలో నిర్వహించనున్న సీసీ రోడ్లు, డ్రేనేజీ వర్కులకు సంబంధించి రూ.3 కోట్ల 34 లక్షల నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులకు సంబంధించి కోలంక గ్రామంలో సీసీ రోడ్డు పనులకు రూ.16 లక్షలు నిధులు మంజూరు అయ్యాయన్నారు. అనంతరం వాసంశెట్టి సత్యం పుట్టిన రోజు పురస్కరించుకుని కోలంక సర్పంచ్ ఏర్పాటు చేసిన భారీ కేక్ ను మంత్రి వాసంశెట్టి సుభాష్ కట్ చేశారు. అనంతరం పెదలంక గ్రామంలో సర్పంచ్ సీహెచ్ పార్వతి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట గ్రామ సర్పంచ్ గుబ్బల మౌనిక,కూటమి నాయకులు గుబ్బల నాగరాజు,బొండా వెంకన్న,దేగల సతీష్, తాతబ్బాయి,పేపకాయల బాబ్జీ,ఎంపీడీవో జె.రాంబాబు, పంచాయతీ కార్యదర్శి పి.మహాలక్ష్మి,ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్,గుత్తుల శ్రీనివాస్, మేడిశెట్టి చంటి,చెరువూరి బుల్లిరాజు,పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 6 గ్రామాల్లో రూ 1.32 కోట్లతో భూమి పూజ.

కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు.





**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 20:**దేశ పురోగతి సాధించడానికి గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ, అహర్నిశలు కృషి చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని పెనికేరు, గుమ్మిలేరు, పెదపల్ల, పినపల్ల, సంధిపూడి,ఆలమూరులలో పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలలో భాగంగా రూ 1.32 కోట్లతో అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన భూమి పూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఇందులో పెనికేరులో రూ. 25 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు, డ్రైన్ కు శంకుస్థాపన చేసారు. గుమ్మిలేరులో రూ. 15 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు, డ్రైన్ కు శంకుస్థాపన చేసారు. పెదపల్లలో రూ. 17 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు, డ్రైన్ కు శంకుస్థాపన చేశారు. పినపల్ల గ్రామంలో రూ. 25 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు,డ్రైన్ కు శంకుస్థాపన చేసారు. సంధిపూడిలో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు, డ్రైన్ నకు శంకుస్థాపన చేసారు. ఆలమూరులో రూ. 33 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమం విజయవంతంగా సాగిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో పల్లెలు అభివృద్ధికి నోచుకోక విలవిలలాడాయన్నారు. నేడు పండుగలా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామాల్లో ఈ అభివృద్ధి ఆరంభం మాత్రమేనని రాబోయే రోజుల్లో పూర్తి స్థాయిలో గ్రామాల అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూనపు రెడ్డి లక్ష్మయ్య నాయుడు మన మధ్య లేరు..!



**పెనుమంట్ర(పెనుగొండ ), అక్టోబర్ 20,పెన్ పవర్ :** స్నేహశీలి, నిగర్వి, అందరికీ ఆప్తులు అంతకంటే మార్గదర్శకులైన పెనుగొండ ప్రముకులు, మాజీ ఎమ్మెల్యే కూనపరెడ్డీ వీరరాఘవేంద్రరావు కుమారుడు లక్ష్మయనాయుడు (నానాజీ) ఆదివారం తుదిశ్వాస విడిచారు. పెనుగొండ నియోజకవర్గానికి రెండుసార్లు ఎమ్మెల్యేగా, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వ్యవస్థాపకులు, కవికులాలంకార కీశే జవ్వాది లక్ష్మయ్యనాయుడుకు మునిమనమవడుగా, పెనుగొండ ఎమ్మెల్యే జవ్వాది శ్రీరంగ నాయకులు మానవుడిగా నానాజీ ఉభయగోదావరి జిల్లాల్లో ప్రసిద్ధులు. పెనుగొండ వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా, డీసీసీబీ డైరెక్టర్, వర్తమాన రాజకీయాలలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకొని ఆదర్శంగా నిలిచారు. నాయుడు లేరనే చేదు నిజం జీర్ణించుకోలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మయ్య నాయుడు మృతి ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయవేత్తగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నాయుడు మృతికి స్నేహితులు, ప్రజలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, శ్రద్ధాంజలి ఘటించారు.

# మాముడూరులో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం




**పెనుమంట్ర, పెన్ పవర్,అక్టోబర్-20:**
పెనుమంట్ర మండలం మాముడూరు గ్రామ జనసేన పార్టీ కార్యాలయం ఆ పార్టీ మండల అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్ ఆదివారం ప్రారంభించారు. జనసేన పార్టీ కార్యాలయం కోసం తన సొంత ఆఫీస్ ని కేటాయించిన వానపల్లి హనుమాన్ కి జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు తరఫున వెంకట కార్తీక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామంలో జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి మాజీ వైఎస్ఆర్సీపీ నాయకులు మాముడూరు గ్రామ శివాలయం దేవస్థానం మాజీ చైర్మన్ ముంగండ శివగణేష్, వైసీపీ నాయకులు కానూరు సూర్యనారాయణ, యువత పాల కిరణ్, వానపల్లి నాగేశ్వరరావు, గుమ్మల శ్రీను, కుక్కలా అనిల్ జనసేన పార్టీలో చేరారు. వీరికి కార్తీక్ కండువా కప్పి జనసేన పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మన మాముడూరు మన బాధ్యత అను కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మాముడూరు గ్రామంలో ఉన్న ప్రతి కుటుంబం వద్దకు జనసేన పార్టీ కార్యకర్తలు వెళ్లి వారికి వున్న ఇబ్బందులను తెలుసుకుని వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు సక్రమంగా వచ్చేలా చేయాలని ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు షేక్ ఆలీ, మాముడూరు గ్రామ జనసేన పార్టీ నాయకులు చెన్నూరి శ్రీనివాస్, చిక్కాల నాగేంద్ర నడపన రమేష్, నడపన సందీప్, వానపల్లి అంజిబాబు, వానపల్లి మాధవ్, వెలివెల అమరేంద్ర మరియు తదితర జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న

- బాసర విద్యాసంస్థలు
- ప్రభుత్వ సెలవు దినములో కాలేజ్ లు
- విద్యార్థులు పై ఒత్తిడి పెంచుతున్న బాసర విద్యాసంస్థలను అడ్డుకున్న ఎబివిపి







**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం అక్టోబర్ 20 :** విద్యార్థులకి ప్రభుత్వం ఇచ్చిన పండగ సెలవు లును,విద్యార్థులు ప్రశాంతంగా తల్లిదండ్రులతో సమయం గడిపి పండగలు య్నొక్క ప్రాముఖ్య తలు తెలుసుకొనివ్వకుండా,విద్యార్థులు యొక్క స్వేచ్ఛాభావాని అణిచివేస్తూ విద్యార్థు లు పై ఒత్తిడి పెంచుతున్న బాసర విద్యార్థి సంస్థలు,నిన్నటకి నిన్న దసరా పండగ టైమ్ లో కూడా సెలవు లు ఇవ్వకుండ వారికి ఒత్తిడి తీసుకురావడంతో జిల్లా విద్యా శాఖ అధికారి అయిన ఆర్.ఐ.ఓ చెప్పినా బాసర యాజమా న్యం తిరుమారకపోవటంతో, స్వయంగా ఆర్.ఐ.ఓ వెళ్లి వార్నింగ్ ఇచ్చి కాలేజ్ క్లోజ్ చేపించారు,అయినప్పటికీ వారు యొక్క తీరు మారకుండా ఆదివారం కూడా కాలేజ్ నడుపు తూ విద్యార్థులు పై ఒత్తిడి పెంచుతున్న బాసర విద్యా సంస్థలు పైన యాజమాన్యం పైన ప్రభు త్వం కట్టిన చర్యలు తీసుకోవలసింది కోర్చున్నా ము అని అర్బన్ జిల్లా కన్వీనర్ ఉమ్మడి నితిన్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ ఎఫ్ డి కన్వీనర్ లొడగల అచ్చిబాబు,రాష్ట్ర కో కన్వీనర్ రాయుడు నితిన్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రసాద్ నల్లబెల్లి, నైదాన ధనుష్,సిరిపురపు వాసు, కంచుమూర్తి విష్ణు వర్ధన్,దార్ల పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భీమిలి తదితర ప్రాంతాల కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలి

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం అక్టోబర్ 20.** :భీమిలి నియోజకవర్గం అభివృద్ధి – ప్రధాన సమస్యల పరిష్కారం కోసం పెద్దిపాలెం చెన్నా ఫంక్షన్ హాల్లో అక్టోబర్ 25 వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా అధికారులతో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుంది.
భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ తో పాటు జిల్లా అధికారులు ఇందులో పాల్గొంటారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెం దుతున్న మధురవాడ, ఆనందపురం, భీమిలి తదితర ప్రాంతాల కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాల్సి ఉంది. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నే షనల్ ఎయిర్ పోర్టు అందుబాటులోకి వచ్చే సమయానికి ఈ ప్రాంతాల్లో సమాంతరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి కూడా రూపకల్పన చేయాల్సిన ఆవశ్యకత ఉంది. వీటితో పాటు పెండింగ్ సమస్యల పరిష్కార వేదికగా ఈ సమావేశం భవిష్యత్ భీమిలి సహా విశాఖ సిటి అభివృద్ధికి దిశ నిర్దేశం చేస్తుంది.

# డా.ఏ.పి.జె.అబ్దుల్ కలామ్ జాతీయ ప్రతిభా పురస్కార్ గ్రహీత డా.బూసి వెంకటస్వామి




**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం అక్టోబర్ 20. :**దక్షిణాది రాష్ట్రాలలో అత్యంత ప్రతిభావంతు లైన,వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికిచ్చే డా ఏ పి జె అబ్దుల్ కలాం జాతీయ పురస్కారాన్ని ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగ ఆచా ర్యులు డా బూసి వెంకటస్వామి అందుకున్నా రు.ఆదివారం గుంటూరు ఏ సి కళాశాల ఆడిటో రియంలో యస్ పి యల్ టి వో ( సదరన్ ప్రైవే టు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ) ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభలో వెంకటస్వామికి అవార్డు ప్రధానం చేయబడింది.కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల యం.యల్.సీ కె.ఎస్.లక్ష్మ ణ రావు ,గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ,ఏ సి కళాశాల ప్రిన్సిపాల్ డా కె మోజేష్ ,మలినేని విద్యాసంస్థ ల డైరెక్టర్ మలి నేని పెరుమాళ్ళ ,అప్పుస్మా డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు,అప్సా డైరెక్టర్ మేకల రవీంద్ర బాబు చేతుల మీదగా ఈ అవార్డు అందుకున్నా రు.డా ఏ పి జె అబ్దుల్ కలామ్ జాతీయ ప్రతిభా పురస్కారం అందుకు న్న డా బూసి వెంకటస్వా మిని విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, తెలు గు విభాగ ఆచార్యులు ,పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు,తెలుగు సాహితీ, భాషాభిమా

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com